# నవ్వు నలభై విధాల మేలు

"నవ్వు నాలుగందాల చేటు" అన్నారు మన పెద్దలు
నవ్వి మహాభారతంలో కురుక్షేత్రానికి కారణమయింది ద్రౌపతి నవ్వుతూనే కురుక్షేత్రాన్ని నడిపించాడు కృష్ణుడు రామరాజ్యంలో నవ్వులు చూడాలని దశాబ్దం పాటు సీతకి కన్నీళ్ళుతెప్పించాడు ఆ శ్రీరామచంద్రుడు

రకరకాలుగా నవ్వి, నవ్వించి, నటనకే నిర్వచనం చెప్పాడు మహానటుడు ఎస్ వి రంగారావ్ ప్రధాన మంత్రి అయి, అసలు నవ్వకుండానే దేశాన్ని ముందుకు నడిపించారు పి వి నరసింహారావ్ ఆయనా మన్‌మోహన్‌సింగ్, చిదంబరం కలిసి అన్నిదేశాలూ ముందుకు వెడుతుంటే మనం నవ్వులపాలవకుండా భారతదేశాన్ని ఐదేళ్ళల్లో ప్రపంచ సాంకేతిక ఆర్థికరంగాల్లో ముందు బెంచీకి లిసుకు వచ్చారు నవ్వుతూనే ఎన్నోసార్లు ఇటు తమిళనాడునీ అటు భారతదేశాన్ని ముంచేసింది జయలలిత కేసుల్లోనూ కష్టాల్లోనూ వున్నానవ్వుతూనే చివరి నాలుగేళ్ళు గడిపేసి, ఆర్థికంగా దేశాన్ని ఎంతో గొప్పగా ముందుకు నడిపించాడు ఆ రోజుల్లోని అమెరికా ప్రెసిడెంటీ క్లింటన్

ఒక పక్క గిలిగింతలు పెడుతూనే, నవ్వితే నవ్వండి' మాకభ్యంతరం లేదు' అన్నారు ముళ్ళపూడి వెంకటరమణా, బాపూలు అపునవును అంటున్నారు, ఆరోగ్యం కోసం ఇండియాలో నవ్వండి నవ్వించండి అని నవ్వుల క్లబ్బుల పెద్దలు

అమెరికా జీవనం చూసి నవ్వు నలభై విధాల మేలు' అంటున్నాను నేను

ఆనాటి గురజాడనించీ, చిలకమర్తి, మొక్కపాటీ, మునిమాణిక్యం, భమిడిపాటిలాటి మహామహుల తర్వాత, మళ్ళీ ముళ్ళపూడీ, బాపూ, జంధ్యాల రావి కొండల్రావు, కొనరాజు, చంద్ర, జయదేవ్ మొదలైనవారు మనల్ని హాస్య రచనలతోనూ, వేణుమాధవ్ తన మిమిక్రీతోనూ, శివరాం, పేకేటి, రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, బాలకృష్ణ, పద్మనాభం, నల్లరామ్మూర్తి, ఎస్ వి రంగారావ్, గిరిజ రమాప్రభ సూర్యకాంతం, సుత్తి జంట, బ్రహ్మానందం, ఎ వి ఎస్ లాటి వారు వారి నటనతోనూ మనల్ని వంద సంవత్సరాల పైన తెలుగు నవ్వుల్లో ముంచెత్తారు

ముళ్ళపూడి వెంకటరమణగారు విజయవాడలో ఓ పుస్తక మహోత్సవం ప్రారంభం చేస్తూ ఇలా అన్నారుట మహారాజశ్రీ టీవీవారు కూడా ఇప్పటి ప్రోగ్రాములనే మళ్ళీమళ్ళీ వేస్తూ, స్థాయి మార్చకుండా చూస్తూ, ఒక్కిండస్ట్రీ అభివృద్ధికి సాయపడాలని మళ్ళీమళ్ళీ కోరుతున్నాను అని అలా మన ఎదరు ప్రభుత్వంవారి టీవీకూడా, ఆ రోజుల్లో యథాశక్తి హాస్య పుస్తకాల కొనుగోలుకి తోడ్పడి, నవ్వుల అభివృద్ధికి ఎంతో సేవచేసింది ఇవన్నీ పుస్తకాలలో చదువుతున్న, సినిమాల్లో చూస్తున్న వింటున్న హాస్యం రోజూ అందరూ గాయత్రి జపించినట్టుగా, గుర్తు పెట్టుకోవాల్సిన నిత్య నగ్న సత్యం ఒకటుంది అదే ముళ్ళపూడి వెంకటరమణ మాష్టారు నవ్వు గురించి పెళ్ళిపుస్తకం సనిమాలో చెప్పిన డైలాగు నాకెప్పుడూ ఎదో ఒక సందర్భం

లో గుర్తుకి వస్తూనే వుంటుంది. నన్ను ముందుకి నడిపిస్తుంటుంది. అది నవ్వొచ్చిన ప్పుడు ఎవడైనా నవ్వుతాడు. ఏడుపొచ్చినప్పుడు నవ్వేవాడే హీరో' అని.

ఇక అమెరికాలో సాంస్కృతికంగా ఈ నవ్వులు చిరునవ్వులు నిత్య జీవి తంలో ఎలా ఉపయోగపడుతున్నాయో చూదాం.

కాపిటలిజం, అమెరికన్ చైనా జపాన్ తైవాన్ సింగపూర్ కొరియా కెనడా యూరప్ మొదలైన అభివృద్ధి చెందిన దేశాల్లో నవ్వుతూ నిలబడటానికి కారణం కూడా ఈ నవ్వులే అని నా అభిప్రాయం. ఎవరైనా అమెరికాలో మొట్టమొదట అడు గు పెట్టినప్పటినించీ చూసేది ఈ చిరునవ్వుల్నే. ఎయిర్‌పోర్ట్ కౌంటర్ దగ్గరికి వెళ్ళ గానే, నవ్వుతూ పలకరిస్తుంది అక్కడి క్లర్క్ "వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ" అని. విమానం ఎక్కగానే మళ్ళీ చిరునవ్వులే. హోటల్‌కివెళ్ళినా అవే చిరునవ్వులు. షాపు లో ఏదన్నా కొని కౌంటర్ దగ్గరికి వెళ్ళగానే నవ్వుతూ "మీకు కావలసినవన్నీ దొరి కాయా?" అని అడుగుతుంది అక్కడి సేల్స్ అమ్మాయి. డబ్బులు ఇచ్చేసి మనం వెళ్ళబోతుండగా హేవ్ ఎ నైస్ డే అని మళ్ళీ ఇంకో చిరునవ్వు విసురుతుంది. అంతె కాదు, ఏ వస్తువైనా మనకి నచ్చక వారం రోజుల తర్వాత తిరిగి ఇచ్చేస్తుంటే, చిరు నవ్వుతో వెనక్కి తీసుకుంటామని అనటమేకాదు, తీసుకుంటారు కూడాను. (మనం వెళ్ళిపోయాక తిటుకుంటారేమోకానీ, మన ఎదురుగా మాత్రం ఒక చిరునవ్వుని అలవోగ్గా విసుక్కోకుండా అలా విసిరేస్తారు)

అలాగే ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు నవ్వటం మామూలే కానీ పోయేటప్పు డుకూడా మెరుపులాగా ఒక చిరునవ్వుని ముఖం మీద అలా మెరిపించి, వెంటనె దాన్ని మాయం చేసి, మన ఎకానమీ బాగుపడితే నిన్ను మళ్ళీ పిలుస్తాం. అప్పటి దాకా శెలవు సుమా' అని సాగనంపుతారు.

అలాగే మనం ఉద్యోగానికి అప్లయ్ చేసినప్పుడు వాళ్ళు మనకి ఉద్యోగం ఇవ్వనప్పుడు ఒక ఉత్తరం పంపిస్తారు. మీరు పంపించిన రెస్యూమే(సి.వి.) అందింది. అది మాకు బాగా నచ్చింది. మీ చదువూ, చట్టుబండలూ అన్నీ మాకు బాగా నచ్చా యి. కానీ మీ కన్నాకూడా మాకు బాగా నచ్చిన ఇంకొక అతను/ఆమె దొరికినం దున, ఈసారికి మిమ్మల్ని మా కంపెనీలో పనిచేసేందుకు తీసుకునే అదృష్టం మాకు కలగటంలేదు. మళ్ళీ జన్మలో కలుద్దాం. అప్పటిదాకా మీ ఉద్యోగ ప్రయత్నాల్లో లాభం కలగాలని ఆశిస్తున్నాం" అని.

"మీకు తగిన చదువూ, అనుభవం లేవు. మారు పనికిరారు" అని నిర్మొహ మాటంగా వ్రాసే బదులు, నిజానికి వాళ్ళు ఇలా మర్యాదగా వ్రాయటం వల్ల చాల లాభాలున్నాయి. నేను హాస్యం కోసం కొంచెం సాగదీశాను కానీ దాంట్లో అలా నొప్పించని భాషలో, చిన్నబుచ్చని పద్ధతిలో చక్కగా చెప్పటం వల్ల నిరుద్యోగంలో వున్నవాళ్ళకి, వాళ్ళు ఎందుకూ పనికిరాము అన్న భావన మనసులోకి రాకుండా వుంటుంది. అదీకాక ఆ కంపెనీ భవిష్యత్తులో ఉద్యోగం ఇవ్వాలనుకున్నా కూడా ఇంకా వాతావరణం స్నేహపూరితంగా వుంటుంది నొప్పించక తానొవ్వక తప్పిం చుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ' అన్నది వీళ్ళకి తెలిసిపోయింది అమెరికాలో.

అమెరికాలో ఒకసారి పరిచయం అయిన వాళ్ళని మరచిపోవటం అన్నది తక్కువ. ఎప్పుడో ఎక్కడో ఏదో అవసరానికి ఉపయోగించుకోవటం అన్నది, అమెరికాలో నిత్యజీవితంలో ఎప్పుడూ చూస్తూనే వుంటాం.

నేనిక్కడ ఒక కన్సల్టింగ్ కంపెనీ పెట్టాలంటే వచ్చే క్లయింట్స్ అందరూ ఈ పరిచయాల వల్లనే. నాకింకో కంపెనీలో ఉద్యోగం కావాలంటే ఈ నెట్‌వర్కింగ్ వల్లనే సులభమవుతుంది. అలాగే చాల విషయాల్లో ఇది అవసరం. ఈ నెట్‌వర్కింగ్ పెంచుకుపోవటానికి మనకి అయే ఖర్చు ఒక్క చిరునవ్వు. ఇంకో చిరునవ్వు. అంతే.

రోజూ పొద్దున్నే ఆరుగంటలకి డ్రైవ్వేలోనించి న్యూస్‌పేపర్ తెచ్చుకోవాలి. అప్పుడే నిద్ర లేచి లుంగీతో వుంటానేమో బయట ఎవరన్నా చూస్తే బాగుండదని, లుంగీ పైకి కట్టుకుని, గబగబా బయటికి వెళ్ళి పేపర్ తీసుకుని వచ్చేస్తుంటే, 'గుడ్ మార్నింగ్' అని వినిపిస్తుంది. అటు తిరిగి చూస్తే పక్కింటి పౌలా. తనూ న్యూస్ పేపర్ తీసుకుని నైటీలో లోపలికి వెడుతూ, చిరునవ్వుతో కనిపిస్తుంది. నా లుంగీ అవతారాన్ని చూసి నవ్విందో, నన్ను చూసి పలకరింపుగా నవ్విందో అర్థంకాక, నేనూ ఓ నవ్వు నవ్వి, చకచకా లోపలికి వచ్చేస్తాను.

ఇప్పటివాకా స్నేహపూరితంగావుండే చిరునవ్వుల గురించి చెప్పుకున్నాం. కానీ మన మీద కోపంగా వున్నప్పుడు కూడా నవ్వేవాళ్ళు వున్నారు. అమెరికన్లు, సహజంగా, మనలాగ ఉద్రేకపూరితులు కాదు. అంటే మనలాగా, మిగతా ఆసియా దేశాలవారిలా ఇమోషనల్‌గావుండరు. అది వీళ్ళ సంస్కృతిలోనేవుంది. కోపం వచ్చినా నవ్వుతూనో, నవ్వకుండానే నెమ్మదిగానో మాట్లాడటం ఇక్కడ ఒక లక్షణం. దానివల్ల లాభం, ఇందాక చెప్పినట్టుగా, స్నేహపూరిత వాతావరణం. కొత్తగా ఈ సంస్కృతిని చూస్తున్నవాళ్ళకి సంస్కృతంలాగానే ఇది కూడా గాబరా పుట్టిస్తుంది. ఎందుకంటే కోపం చూపించనప్పుడు మనకి వాళ్ళు కోపంగా వున్నారని తెలుసుకోవటం కష్టం. ఎదుటివాడి మనసులో ఏముందో ఊహించటం సాధ్యంకాదు. కానీ ఈ సంస్కృతికి బాగా అలవాటు పడిన తర్వాత, మనకి మనుష్యుల్ని చదవటం సులభమయి పోతుంది. ఎందుకంటే మనమూ అలాగే చేస్తుంటాం కాబట్టి.

కోపం వచ్చినప్పుడు, తుపాకీ తీసి ఎదుటివాడ్ని కాల్చేసే మీ అమెరికాలో, అనబోతున్నారు అనకాపల్లినించీ అప్పారావ్‌గారూ, అప్పల నరసమ్మగారూ వారి ఇరుగూ పొరుగూ, బంధుమిత్రులూ. మరి మీరేమంటార్ సార్? ఏమంటాను. మీరు సినిమాలు ఎక్కువగా చూస్తున్నారంటాను. అలాటివప్పుడప్పుడూ ఎక్కడో ఒక చోట, అన్ని దేశాల్లోనూ జరిగేవే. మనం మామూలు నిత్య జీవితంలో జరిగే వాటి గురించి మాట్లాడుకుంటున్నాం. ఇంతకు ముందేదో కథలో నేను వ్రాసినట్టుగా మామిడికాయ పప్పులో రాయి వచ్చిందని మామిడికాయపప్పు బాగుండదు అంటే సవ్యంగా వుంటుందా? ఎక్కడ వున్నా ఏం చేస్తున్నా నవ్వుతూ నవ్విస్తూ కలకాలం బ్రతకటం, ఈ కలికాలంలో అవసరం అని నా ఉద్దేశ్యం.

అందుకే అంటున్నాను, "నవ్వు నలభై విధాల మేలు" అని.

* * *